# పిల్లంగ్రోవి

ఆ బాలకుని పిల్లంగోరు పొలంగట్టులు, చేలు, కాలవలు, కొద్దిదూరానఉన్నకొండలు నిండుతూ ఉన్నది.

అతనికి రాగజ్ఞానం లేదు! ఆతడు స్వరవిద్య నేర్చుకోలేదు. ఆతనిగురువులు కోకిల, తుమ్మెద, సెలయేరు, ఆవుల అంభారవం, చేలమీదినుంచి తేలిపోయే మలయబాలకుడు, ఉఱుము, కీచురాయి, లవంగిపిట్టలు.

ఆతనికిఉన్నజ్ఞానమే గాంధర్వము. ఒకస్వరం ఇంకో స్వరం శ్రుతిచూస్తాడు. ఆతని ఊపిరే లయ! ఆ లయలోంచి వచ్చిన తాళాలు మూడే, ఆది, ఏక, రూపక తాళాలు.

ఆతడుకల్పించిన గీతాపథకాలు విచిత్ర మూర్ఛనలు.

## 2

గొడ్లకాపు కుఱ్ఱవాడు, తొమ్మిదేండ్ల ఈడువాడు. చలిదివన్నం గంజీ ఉప్పుచేప నంజుకుంటూ మెక్కి, ముంతలో గంజివన్నం పెట్టుకొని, ఉప్పులో ఊరవేసి ఎండబెట్టిన మామిడికాయబద్ద, కంచమూ మూటకట్టుకొని గేదెపై స్వారిఅవుతూ ఏటిగట్టుకు వస్తాడు.

ఆతని సింహాసనం వేపచెట్టునీడ, అతని ప్రజలు పశువులు. ఆతని ఆయుధం పిల్లంగ్రోవి!

అతని పట్టుపీతాంబరాలు చినిగినగోచీ, చినిగిన తలపాగాగుడ్డ! వానవస్తే రెండుగేదెల్ని నిలబెట్టి వాటిఅడుగున కూచుంటాడు. ఏరు పొంగితే గేదెలమీద దాటుతాడు.

ఆతని రక్షకభటులు ఆవులు గేదెలు. పెద్దపులినైనా దూరాన నిలబెట్టుతాయి.

## 3

పశువులతో మేతబయలుకు రాగానే 'హౌండత్తా' అని చెట్టుకింద మకాం వేస్తాడు. ఆటలు ఆడుతాడు, పాటలు పాడుతాడు.

పిల్లంగోవి తీసి భువనమోహనంగా వాయిస్తాడు. ఆ పాటలకు సాహిత్యం ఆతని హృదయమే!

ఒకసారి ఆతనిపాట ఎగిరి గంతులు వేస్తుంది. పూవులు పూస్తుంది. చిరువాసనలు వెదజల్లుతుంది. చిట్టి చిట్టి ఊటలా జలజలలాడుతుంది.

ఒకసారి ఆతనిపాట లోకాన్ని చూచి ఆశ్చర్యం పడుతుంది. తెల్లబోతుంది, వణుకుతుంది.

ఒకసారి ఆతనిగీతం ఏదో వెదుకుతుంది. ఆకాశాన్ని పారకించి చూస్తుంది భూమిలోతులు చొచ్చిపోతుంది. నదీనీరాంబుకణాలు లెక్కబెడుతుంది.

మరి ఒకసారి కంటనీరు నింపుతుంది. ఏదో ఎరగని భయంచే ముడుచుకుపోతుంది, ఆకలై ఘుమిక్కుస్తుంది, మానవుని సర్వబాధలై విలపిస్తుంది.

ఇంకొకసారి అన్నీ తెలిసిన జ్ఞానిపద్మంలా యోగముద్ర వహిస్తుంది. గడ్డిపూవుల నివేదనలిస్తుంది. ఏటిలోని చేపలలా లోతులు కనిపెట్టుతుంది.

370
580



ఇంతలో లోకాలు బద్దలుచేసే ధ్వనితో ఆకాశంలో ఏదో పెద్దపక్షి.

ఆ చప్పుడుకు అదిరిపడి ఆ బాలకుడు పిల్లంగ్రోవి ఆపి గభాలున భూమిమీద పడిపోయాడు. ఆ బాలిక దద్దరిల్లి హోరు మంటూ అతనిపక్క వాలి అతన్ని కౌగలించుకొంది.

ఆ రాక్షసిపక్షి వెళ్ళిపోయింది. కొంతసేపటికి ఆ పసికందు లిద్దరూ లేచి తమచుట్టూ అంతా కళ్ళనీళ్ళతో పారచూచారు.

ఆతని ఆవులు, గేదెలు నిశ్చలంగా మేస్తున్నాయి. పువ్వులు వికసించిఉన్నాయి. వేపచెట్టు ఆవరించే ఉన్నది. సెలయేరు జల జల ప్రవహిస్తూ ఉన్నది.

ఆతడు ధైర్యంవహించి పిల్లంగ్రోవి తీసి మళ్ళీ మూడు పవిత్రస్వరాలు కలిపాడు. ఏమీవిశ్వం అన్నట్టుగా ఒక్క మూర్ఛన వచ్చింది. ఆ బాలిక అతన్ని కౌగలించుకునేఉంది

దూరంగా యూరపులో యుద్ధం జరుగుతున్నది. జపాను పెరల్ హార్బరుపై విరుచుకుపడింది.

ఆ బాలకుడు అదటుతీరి రోజూ ఆకాశంలో వచ్చి పోయే ఆ రాక్షసిపిట్టలమోతకు శృతికలిపి ఒకకొత్తమూర్ఛన ప్రమోయించాడు. ఆ బాలిక చిరునవ్వుతో అతనిపాట పరవశమై విన్నది.